సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 28 । మార్చి । 2023



మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. 8లో



చిరుధాన్యాలతో పౌష్టికాహారం

చిరుధాన్యాల వినియోగంతో సంపూర్ణ పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి తెలిపారు. 8లో



ఈదురు గాలులతో వర్షం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

ఇఫ్తార్ (మంగళవారం)	సహర్ (బుధ)
6-10	4-39

రంపచోడవరం :

ఇఫ్తార్ (మంగళవారం)	సహర్ (బుధ)
6-25	4-42

న్యూస్‌రీల్

108లో ప్రసవం



బిడ్డను ఆశ కార్యకర్తకు అప్పగిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108లో ప్రసవించింది. రింతాడ గ్రామానికి చెందిన మువ్వల దీపాయి నిండు గర్భిణి. ఈమెకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆమెను చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమై మార్గమధ్యంలో అంతర్ల వద్ద 108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను చింతపల్లి ఆస్పత్రికి తరలించినట్టు సిబ్బంది తెలిపారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతే ధ్యేయం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

డుంబ్రిగుడ: టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సలీమ్ భాషా అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఎంఈవో రామచంద్రరావు, హెచ్ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ జిల్లా అధికారిగా చంద్రశేఖర్



అనకాపల్లి టౌన్: నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఈవో ఎస్. చంద్రశేఖర్‌ను దేవదాయ శాఖ అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారిగా నియమించారు. ప్రస్తుతం ఆయన అనకాపల్లి నూకాంబిక ఆలయ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే అల్లూరి జిల్లా ఇన్‌చార్జి ఏసీగా వ్యవహరిస్తున్నారు. ఈ బదిలీతో ఆయన అల్లూరి జిల్లాకు పూర్తి స్థాయిలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

అనర్హుల పింఛన్లు రద్దు చేయాలి



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ రమేష్ రామన్

ఎటపాక: ప్రభుత్వం నుంచి సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్న అనర్హులను గుర్తించి, వారికి పెన్షన్ రద్దు చేయాలని డ్వామా పీడీ రమేష్‌రామన్ ఆదేశించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల తనిఖీల వివరాలను సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో వెల్లడించారు. రూ.9కోట్లతో చేపట్టిన 536 పనులను తనిఖీ చేసినట్టు చెప్పారు. వేతనదారులందరికీ సకాలంలో వేతనాలు అందించినట్టు ఆడిట్ బృందం తెలిపింది. పరిమితికి మించి భూమి ఉన్న వారు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు కూడా పింఛన్లు పొందుతున్నట్టు ఆడిట్‌లో తేలిందని బృందం వెల్లడించింది. అటువంటి వారిపై డీఆర్‌డీఏకు నివేదిక పంపనున్నట్టు పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాక కామేశ్వరి, ఏపీడీవో విఠల్‌పాల్, ఏపీవో అరవాలు తదితరులు పాల్గొన్నారు.





జీ20 ప్రతినిధులకు ఘనస్వాగతం

వెల్‌కమ్ టు వైజాగ్



సిటీ లుక్ : విద్యుత్ కాంతుల్లో సుందర నగరం

- జీ-20 సదస్సులో పాల్గొనే ప్రపంచ దేశాలకు ఆహ్వానం
- నేటి నుంచి వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ పేరుతో జీ20 సదస్సు
- ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహణ
- రూ.157 కోట్లతో సర్వాంగ సుందరంగా విశాఖ ముస్తాబు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. రోడ్లు మెరిసిపోతున్నాయి.. రోడ్ల మధ్య ఉన్న డివైడర్లు పచ్చని మొక్కలతో అలరిస్తున్నాయి.. రోడ్డుకు ఇరువైపులా గోడలపై తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళా రూపాలు ఆకర్షిస్తున్నాయి. జంక్షన్లు, ట్రాఫిక్ ఐలాండ్లు విభిన్నంగా ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. సువిశాల సాగరతీరం సరికొత్త అందాలను అద్దుకుంది. కైలాసగిరి, సీతకొండల రాళ్లపై చిత్రాలు ప్రతి ఒక్కరినీ కట్టి పడేస్తున్నాయి. పర్యాటక ప్రాంతాలు మరింత అందంగా ముస్తాబయ్యాయి. కొత్త బీచ్‌లతో పాటు ఐలవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ వంటివి పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. ఇలా సిటీ ఆఫ్ డెస్టినీ మరో అంతర్జాతీయ సదస్సుకు సన్నద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ-20 సదస్సుకు సాగర తీరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ మరింత పెంచేలా.. దేశం గర్వించేలా సదస్సును విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరం మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే అతిరథ మహారథులందరినీ కట్టిపడేసేలా రూ.157 కోట్లతో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

తొలిసారి అవకాశం

విశాఖ అనేక అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. తాజాగా ప్రతిష్టాత్మక జీ20 సదస్సుకు ఆతిథ్యమిస్తోంది. ఇటీవలే దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ అయింది. దిగ్గజ పారిశ్రామికవేత్తలు విశాఖలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వనరులను ప్రపంచ దేశాలకు తెలియజెప్పారు. తాజాగా జీ-20 సదస్సు కోసం విదేశాల నుంచి ప్రతినిధులు విశాఖకు వస్తున్నారు. 'వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్' అనే థీమ్‌తో రాడిసన్ బ్లూ బీచ్ రిసార్ట్‌లో జీ-20 సదస్సు జరగనుంది. ఇప్పటికే 57 మంది ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. తొలి రోజు మూడు విభిన్న అంశాలపై సమావేశాలు జరగనున్నాయి. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ సదస్సును ప్రారంభించనున్నారు. సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సదస్సుకు హాజరవుతున్నారు. వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. రెండో రోజు 29వ తేదీన మౌలిక సదుపాయాల కల్పన అంశంపైన, మూడో రోజు 30న కెపాసిటీ బిల్డింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

జీ-20 సదస్సుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. 2,500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కటుదిట్టమైన బందోబస్తు కల్పిస్తోంది. ఇందులో 1,850 మంది సివిల్ పోలీసులు, 400 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్, 4 గ్రే హౌండ్స్ దళాలు, 2 క్యూఆర్టీ టీమ్స్, 6 ప్రత్యేక పార్టీలు, 2 ఏపీఎస్పీ ప్లాటూన్లను మోహరిస్తున్నారు. ప్రతినిధుల భద్రతా చర్యల్లో భాగంగా ఆరు ప్రాంతాలను రెడ్ జోన్లుగా పోలీసులు ప్రకటించారు. రాడిసన్ బ్లూ రిసార్ట్, ఆర్‌కే బీచ్ రోడ్, కైలాసగిరి, ముడసర్లోవ పార్క్, జిందాల్ ఎనర్జీ ప్లాంట్, స్కాడా మాధవధార ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డ్రోన్ల ఎగరవేతపై పోలీసులు నిషేధం విధించారు. ఇప్పటికే విదేశీ ప్రతినిధులు పర్యటించే ప్రాంతాల్లోను, వారు బస చేసే హోటల్ వద్ద బాంబ్, స్నిఫర్‌డాగ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కటుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన అభివృద్ధి పనులు

రోడ్ల అభివృద్ధి	46 కిలోమీటర్లు
పెయింటింగ్ పనులు	24 కిలోమీటర్లు
ఫుట్‌పాత్‌ల నిర్మాణం	10 కిలోమీటర్లు

ఏమేమి చేశారంటే..

- సీతకొండపై బీచ్ వైఎస్సార్ వ్యూ పాయింట్ ఆధునికీకరణ
- ఐ లవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ ఏర్పాటు
- సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం బీచ్‌ల అభివృద్ధి
- కైలాసగిరి రోప్‌వే నుంచి తిమ్మాపురం వరకు ఫుట్‌పాత్‌లకు టెర్రాకోట్
- రోడ్లకు ఇరువైపులా వెదురు ఆకృతులపై పూలమొక్కలు
- విద్యుత్ స్తంభాలకు వెరైటీ సొగసులు



శిలలపై చిత్రాలు : సీతకొండ వ్యూ పాయింట్ వద్ద అరుదైన కళాకృతులు



వావ్ : చెట్లు..పువ్వులు..వెలుగులు



పువ్వుల్..నవ్వుల్ : వెదురుతో కళాకృతులు



జీ -20 సదస్సులో పాల్గొనే దేశాల చిహ్నాలతో హోర్డింగులు

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక

- జీ20 సదస్సుకు హాజరు
- గాలా డిన్నర్‌లో పాల్గొననున్న సీఎం



సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభం కానున్న జీ-20 సదస్సుకు హాజరుకానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సాయంత్రం 5.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రుషికొండలో గల రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు జి-20 సదస్సుకు వచ్చే 20 దేశాల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం జరిగే 'గాలా డిన్నర్'లో పాల్గొని విదేశీ అతిథులకు ఆతిథ్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సదస్సునుద్దేశించి సీఎం మాట్లాడనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్స్ నుంచి బయలు దేరి 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం వెళ్తారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

- గంజాయి నిర్మూలనే లక్ష్యం
- రూ.15కోట్లతో ప్రతిపాదనలు
- పోలీసులు, వ్యవసాయ అనుబంధ కమిటీల ఏర్పాటు
- కలెక్టర్ సుమిత్ కుమార్



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గంజాయి సాగు నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి పోలీసు,రెవెన్యూ,వ్యవసాయ,ఉద్యానవనశాఖలు, డ్వామా అధికారులతో సోమవారం కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15కోట్లతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించామని, ఈమేరకు పోలీసు,రెవెన్యూ,వ్యవసాయ,ఉద్యానవన,డ్వామా సిబ్బందితో అనుబంధ కమిటీలు వేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలానికి రూ.50లక్షల నుంచి రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు పంపాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సాగుకు అనుకూలంగా ఉన్న వాణిజ్య పంటలతో పాటు జీడిమామిడి, పండ్ల జాతుల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గంజాయికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానిస్తామని చెప్పారు. గంజాయి సాగు మానేసిన గిరిజనులు,లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, మావోయిస్టుల బాధితులు, పీవీటీజీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ అంచనాల ప్రకారం జిల్లాలో 13వేల ఎకరాల్లో గంజాయి సాగులో ఉందని,అందరి సహకారంతో 50శాతం పైగా గంజాయి తోటలను పోలీసుశాఖ నాశనం చేసిందన్నారు.ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం గురించి గిరిజన గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో విజయవంతమైందన్నారు. ప్రత్యామ్నామ పంటల సాగుకు గిరిజనులకు పోలీసుశాఖ అన్ని విధాల సహకరిస్తుందన్నారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ లక్షకు పైగా ఎకరాలకు అటవీ హక్కుల చట్టం కింద భూమి హక్కులు కల్పించామని,ఆయా భూముల్లోను వ్యవసాయ అభివృద్ధి, గ్రామాల్లో గంజాయికి ప్రత్యామ్నాయంగా పంటల సాగుకు పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, వ్యవసాయాధికారి నందు,డ్వామా పీడీ రమేష్‌రామన్, ఉద్యానవన శాఖాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా క్షయ నిర్ధారణ పరీక్షలు

హుకుంపేట: క్షయ నిర్ధారణ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో ఐసీఎంఆర్, గీతం మెడికల్ కళాశాల సంయుక్తంగా అందజేసిన రూ.7లక్షల విలువైన క్షయ నిర్ధారణ యంత్ర పరికరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రోగులకు మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆరోగ్య, సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి టి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి , గీతం మెడికల్ కళాశాల అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ పరిహారం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్‌బాబు



చింతూరు గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్‌బాబు

చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న వారందరికీ పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చింతూరు యూనిట్ పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్‌బాబు తెలిపారు. పోలవరం పునరావాసం, పరిహారం(ఆర్అండ్ఆర్)పై సోమవారం చింతూరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గోదావరి వరద ముంపునకు గురవుతున్న చింతూరును ప్రాధాన్యతా క్రమంలో తొలి దశలో చేర్చి 1,445 గృహాలను, 1,918 కుటుంబాలను అర్హులుగా నమోదు చేసినట్టు చెప్పారు. ఇంకా గృహాలు, కుటుంబాలు ముంపు జాబితాలో నమోదు కాకుంటే తమకు దరఖాస్తులు ఇవ్వాలని, వాటిని కూడా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటమన్నారు. నిర్వాసిత గిరిజనులకు ఎటపాక మండలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు సమీపంలోనే వ్యవసాయ భూమి కూడా అందచేయనున్నట్టు ఆయన తెలిపారు. గిరిజనేతరులకు ఏలూరు జిల్లా తాడ్వాయిలో ఇంటిస్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని, స్థలం, ఇల్లు వద్దంటే నగదు అందచేస్తామని ఆయన తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారందరినీ ముంపు జాబితాలో నమోదు చేస్తున్నామని, ప్రభుత్వం నిర్ణయించే కటాఫ్ తేదీ ఆధారంగా వారికి పరిహారం అందుతుందని ఎస్‌డీసీ చెప్పారు. గృహాలు, పేర్లు, ఇతర మార్పులుంటే నిర్వాసితులు ఆందోళన చెందకుండా దరఖాస్తులు చేసే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. తమకు అందించే పరిహారం, ఇంటిస్థలం విస్తీర్ణం, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారమెంత అనే దానిపై స్పష్టత ఇవ్వాలని నిర్వాసితులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు. గ్రామసభ సందర్భంగా ఆర్అండ్ఆర్‌లో నమోదైన కుటుంబాల వివరాలను వలంటీర్లు క్లస్టర్ల వారీగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీవో రవిబాబు, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల విధుల నుంచి 10 మంది తొలగింపు

రాజవొమ్మంగి: స్థానిక ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను ఆ విధుల నుంచి తొలగిస్తూ ఇంటర్ బోర్డు(రాజమహేంద్రవరం) నుంచి ఉత్తర్వులు అందినట్టు సీఎస్ ఈపూరి ఈశ్వరప్రసాద్ తెలిపారు. స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ కేంద్రానికి శనివారం, 25వ తేదీన వచ్చిన ఫ్లైయింగ్ స్క్వాడ్ మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ముగ్గురిని డిబార్ చేసింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఇన్విజిలేటర్లు, సీఎస్, డీవోలను తొలగించారు. వారి స్థానంలో సీఎస్‌గా ఈశ్వర ప్రసాద్‌ను, డీవో, ఇన్విజిలేటర్లను ఇంటర్ బోర్డు సోమవారం నియమించింది. ఈ కేంద్రంలో సోమవారం జరిగిన సెకండ్ ఇంటర్ భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రం, ఒకేషనల్ పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు సీఎస్ ఈశ్వర ప్రసాద్ తెలిపారు. 302 మందికి 287 మంది మాత్రమే హాజరైనట్టు ఆయన చెప్పారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు అనుగుణంగానే మహిళల పేరిట సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పథకాలకు రూపకల్పన చేశారని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల సందర్భంగా పాడేరు పట్టణంలోని మోదకొండమ్మ ఆలయం ఆడిటోరియంలో సోమవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వెలుగు అధికారులు, డ్వాక్రా సభ్యులు క్షీరాభిషేకం చేసి, థ్యాంక్యూ సీఎం సర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి తమ కృతజ్ఞత చాటుకున్నారు. పాడేరు మండలంలోని 26 పంచాయతీల్లోని డ్వాక్రా సభ్యులకు మూడో విడత కింద మంజూరైన రూ.88,53,487 చెక్కును ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వెలుగు పీడీ మురళి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణాలను మాఫీ చేస్తామని మాట ఇచ్చి డ్వాక్రా సభ్యులను వంచించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైఎస్సార్ ఆసరా సొమ్ముతో మహిళలు వ్యాపారాలు చేసుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండి మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పంచాయత్ రాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు చిన్నారి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, ఎస్.వి. రమణ పాల్గొన్నారు.

నకిలీ పోలీస్ అరెస్టు



నిందితుడితో ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్

రాజవొమ్మంగి: పోలీసు అని చెప్పి మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్న వేళంగి గ్రామానికి చెందిన వెలుగుల వెంకటరమణ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.ఎన్.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 23న స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద టూవీలర్‌తో పరారైన నిందితుడిని అరెస్టు చేసి రంపచోడవరం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. కాగా వెంకటరమణ ఇదే తరహాలో కాకినాడ, నక్కపల్లి, శ్రీకాకుళం, ఏలూరు, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో నేరాలు చేసి, జైలు శిక్షణ అనుభవించాడని ఎస్ఐ తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ పౌష్టికాహారం

ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి

సాక్షి, పాడేరు: చిరుధాన్యాల వినియోగంతో సంపూర్ణ పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో జిల్లాలోని సీడీపీవోలతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలు,అంగన్‌వాడీ సేవల బలోపేతం, మాతాశిశు సేవలు, పౌష్టికాహారం పంపిణీపై సమీక్షించి, పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారాన్ని ప్రదర్శించడంతో పాటు గర్భిణులకు సాముహిక సీమంతాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సీడీపీవోలు దృష్టి పెట్టాలన్నారు.పోషన్ పక్వాడ కార్యక్రమాలను పక్కాగా అమలుచేయాలన్నారు. చిరుధాన్యాల్లో ఉన్న పోషక విలువలపై అవగాహన కల్పించాలని,సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,పాడేరు సీడీపీవో ఝాన్సీలక్ష్మితో పాటు 19 ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులు

- భర్తే హంతకుడు
- అనుమానంతోనే భార్య హత్య
- ఒడిశా నుంచి వలసొచ్చి భద్రాచలంలో నివాసం


హత్య ఘటన వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లో ఈ నెల 15న కలకలం రేపిన యువతి దారుణ హత్య ఘటన మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆమె భర్తే నిందితుడుగా గుర్తించి అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి వివరాలను చింతూరు అడిషనల్ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్లో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కలిమెల తాలూకాలోని పులకనకొండ గ్రామానికి చెందిన సొంది రామ్, సొంది కుమార్ ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతేడాది నుంచి భార్యపై అనుమానం పెంచుకుని వేధిస్తుండగా వీరిద్దరి మధ్య కలహాలు రేగాయి. ఈ నేపథ్యంలో భార్య రామ్ అక్కడ నుంచి రెండు నెలల క్రితం వచ్చి తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని సుందర్యనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. విషయం తెలుసుకున్న భర్త కుమార్ 15 రోజుల క్రితం అక్కడకు వచ్చాడు. ఇద్దరికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో ఈ నెల 14న రాత్రి ఎటపాక మండలం పురుషోత్తపట్టణం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీ సమీప పొదల్లో భార్యకు పూటుగా మద్యం తాగించి తాను తాగుతున్నట్లు నటించాడు. అక్కడ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో వెనుక నుంచి బండరాయితో ఆమె తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. చనిపోయిందని నిర్ధారించుకుని ముళ్ల పొదల్లో మృతదేహాన్ని పడేసి అక్కడ నుంచి పరారయ్యాడు.

నిందితుడు పట్టుబడింది ఇలా...

గుర్తుతెలియని యువతి దారుణ హత్యగా కేసు నమోదు చేసుకున్న ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్సై పార్థసారది దర్యాప్తును వేగవంతం చేశారు. ఆమె గుర్తుల ఫొటోలతో కూడిన వివరాలు కరపత్రాలుగా ముద్రించి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోకి దర్యాప్తు బృందం వెళ్లి విచారణ చేసింది. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఎటపాక పోలీసులను సంప్రదించగా, మృతురాలు రామ్(33) భర్తే హంతకుడుగా అనుమానించి నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 26న హంతకుడు కుమార్ తన భార్య నివాసం ఉన్న ఇంటికి వచ్చాడు. అక్కడ తన బట్టలు తీసుకుని హైదరాబాదు కూలి పనులకు బయలుదేరుతున్న సమయంలో పోలీసులకు చిక్కాడు. నిందితుడిని రిమాండ్‌కి తరలించారు. ఈ కేసు మిస్టరీని చాకచక్యంగా త్వరగా ఛేదించిన సీఐ, ఎస్సై, మిగతా బృందాన్ని ఏఎస్పీ అభినందించారు.

వ్యాన్, బైకు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి– రంపచోడవరం రహదారిలోని టేకు ప్లాంటేషన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్, బైకు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తాడేపల్లి పంచాయతీ పరిధి కొడవటి లంక, డివికోట గ్రామానికి చెందిన కత్తుల శ్రీనివాసురెడ్డి, తుంబుడు మంగిరెడ్డి తమ ద్విచక్ర వాహనంపై మారేడుమిల్లి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో రంపచోడవరం రహదారిలోని టేకు ప్లాంటేషన్ వద్ద చింతూరు వైపు ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగాల కల్పనకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ విభాగం సహకారంతో యాంకర్,పేనాసోనిక్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐటీఐ విద్యార్హత గల 26 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఏడాదికి రూ.1.80 లక్షలు జీతభత్యాలుగా చెల్లిస్తారని తెలిపారు. తిరుపతి సమీపంలో తడ వద్ద శ్రీసిటీలో ఈ ఉద్యోగాల కల్పన ఉంటుందని, దరఖాస్తులు దాఖలు చేయడానికి వచ్చేనెల 10వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. 50 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6304634447 అనే ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఐదు కొత్త అంబులెన్స్‌లను సోమవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో కలెక్టర్,ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారని, వారిలో ఓ డాక్టర్ సచివాలయం పరిధిలో వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో 90 శాతం వైద్యసిబ్బంది ఖాళీలను భర్తీ చేశామని,అరకు,చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్య సేవలకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని,ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో ప్రతి మండలానికి రెండు చొప్పున 104 అంబులెన్స్‌లు, జిల్లాకు సంబంధించి 35 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నకుమారి. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, డీటీసీ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, 104 జిల్లా మేనేజర్ మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి కూనవరంలో గ్రామసభలు

కూనవరం: మండల కేంద్రమైన కూనవరంలో మంగళవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సర్పంచ్ కట్టం రాజమ్మ అధ్యక్షతన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ సోమవారం తెలిపారు. 28, 29 తేదీల్లో టేకులబోరులోని 1038 కుటుంబాల పరిధిలో వారికి గ్రామసభలు జరుగుతాయన్నారు. 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు టేకులబోరు ఎంపీయూపీఎస్ పాఠశాలలో 17వ క్లస్టర్ నుంచి 22వ క్లసర్ వరకు, 29వ తేదీ ఉదయం 10.30 గంటలకు 23 క్లస్టర్ నుంచి 29 క్లస్టర్ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కూనవరంలో 1452 కుటుంబాలకు సంబంధించి 31వ తేదీ నుంచి 1వ తేదీ వరకు గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. క్లస్టర్ 1 నుంచి 8 వరకు 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామసభ జరుగుతుందన్నారు. వచ్చేనెల 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు క్లస్టర్ 9 నుంచి 16 వరకు గ్రామసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామసభలకు వచ్చేవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్‌ఐడీ, బ్యాంకు అకౌంట్, ఇంటి పన్ను రసీదు, విద్యుత్ బిల్లు ధ్రువ పత్రాలు తీసుకు రావాలని చెప్పారు.

ఈదురు గాలులతో భారీ వర్షం


రాజవొమ్మంగిలో జోరుగా కురుస్తున్న వర్షం


విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి/అనంతగిరి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాజవొమ్మంగి మండలంలో మామిడి, జీడిమామిడి పిందెలు నేలరాలాయి. పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. మండలకేంద్రంలో పీహెచ్‌సీ వద్ద విద్యుత్‌లైన్‌పై ఎండిన తాటిచెట్టు కూలిపోవడంతో వైర్లు పూర్తిగా తెగి పోయాయి. మండలంలోని సీతారాంపురంలో విద్యుత్ స్తంభం పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గంటన్నర పాటు కురిసిన వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. అనంతగిరి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాఫీ పూతదశలో ఉండగా వర్షాలు పడుతుండడంతో ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక శోభ

- భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభాల ప్రతిష్ట
- తరలివచ్చిన భక్తులు


ఉత్సవమూర్తులు



కొయ్యూరు, జి.మాడుగులలో ధ్వజస్తంభాల ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

జి.మాడుగుల: చింతపల్లి మండలం కృష్ణాపురం పాకలపాడు గురుదేవులు, వైకుంఠ సీతారాముల దివ్య సన్నిధిలో సోమవారం ధ్వజస్తంభం, ఉత్సవమూర్తుల ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కార్యక్రమం రామానంద స్వామిజీ, పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్య రాస మత్స్యరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ శ్రీరామనవమి వరకు శ్రీరామ నామ జప యజ్ఞం నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ మూర్తుల భారీ ఊరేగింపు కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కృష్ణాపురంలో 30న జరగనున్న శ్రీ రామనవమి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో భక్తులు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొయ్యూరు కొండపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో సోమ వారం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దువ్వా రమణారావు, కృష్ణవేణి దంపతులు ప్రతిష్ఠించారు. గడచిన వారం నుంచి ధ్వజస్తంభం ప్రతిష్టపై ప్రచారం చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆదివారం ఉదయం నుంచి హోమం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రతిష్ఠాపన అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వందలాదిగా భక్తులు తరలివచ్చారు. అలయ కమిటీ సభ్యులు ప్రసాద్, చక్రరావు, సత్యనారాయణ, చిరంజీవి తదితరులు పర్యవేక్షించారు.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం


రాజుపేట కాలనీ ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

వీఆర్ పురం: అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ అన్నారు. పోలవరం ముంపు గ్రామం రాజుపేట కాలనీలో సోమవారం నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా అర్హుల జాబితాలోని పేర్లను క్లస్టర్ల వారీగా వెల్లడించారు. పేర్లు నమోదు కాని వారు తిరిగి దరఖాస్తు చేసుకొవచ్చునన్నారు. అలాగే ప్రభుత్వం ఆర్‌అండ్ ప్రక్రియలో భాగంగా గిరిజనులకు, గిరిజనేతరులకు ఏ విధంగా పునరావాసం కల్పిస్తుందో విపులంగా వివరించారు. రాజుపేట కాలనీలో మొత్తం 663 నిర్వాసిత కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. అందులో రెండు కుటుంబాలు గిరిజన కుటుంబాలు కాగా మిగిలిన వారందరూ గిరిజనేతరులని చెప్పారు. రాజుపేట కాలనీ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను 13.10.2022 తేదీన ప్రకటించినట్టు తెలిపారు. ఆయా తేదీనే ఇకపై కటాఫ్ తేదీగా ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఆ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను పీడీఎఫ్‌గా గుర్తించి వారికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందచేయనున్నట్టు చెప్పారు.అనంతరం అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించారు. పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ లక్ష్మీపతి, ఆర్‌అండ్ ఆర్ కమిటీ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, రాజుపేట సర్పంచ్ వడ్లానపు శారద,ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యలక్ష్మి ,ఉప సర్పంచ్ ముంజపు రాంబాబు ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’కు అర్జీల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: వై.రామవరం మండలంలోని గిరిజనులు ఉపాధి హామీ పథకం ద్వారా రబ్బరు మొక్కలు సరఫరా చేయాలని స్పందన కార్యక్రమంలో సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కోరారు. ఐటీడీఏ సమావేశపు హాలు పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ స్పందనకు 24 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. దేవీపట్నం మండలం శరభవరం గ్రామానికి చెందిన కొంత మంది రైతులు 2019లో వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఇవ్వలేదన్నారు. మట్లపాడు–అప్పలపాడు గ్రామాల మధ్య కాలువపై కల్వర్టు నిర్మించాలని గిరిజనులు కోరారు. పలువురు భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేసినట్టు తెలిపారు. ఎస్‌డీసీ జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మృతి


సురేష్ (ఫైల్)

నక్కపల్లి: మండలంలోని రమణయ్య పేటలో వీర్ల సురేష్ (34) విద్యుత్ షాక్‌కు గురై సోమవారం మృతి చెందాడు. అతడు తన ఇంటి వద్ద కొబ్బరి చెట్టు కాయలు ఇనుప చువ్వతో తీసేందుకు ప్రయత్నిస్తుండగా, పక్కనే హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దాంతో స్పృహ తప్పి పడిపోయిన అతడ్ని కుటుంబ సభ్యులు వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య భవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: స్థానిక వారపు సంత ప్రాంతానికి సమీప ప్రధానరహదారి వద్ద అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టుల కదలికలు, గంజాయి రవాణాపై అందిన సమాచారం మేరకు తనిఖీలు జరిపారు. వాహనాల్లో రవాణా చేస్తున్న సామగ్రిని పరిశీలించి, అనుమానితులు, అపరిచితులపై నిఘా పెట్టారు. లైసెన్సులు, రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదుచేశారు. ఎస్ఐ ఎం .సంతోష్‌కుమార్, సిబ్బంది, సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు


పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మండల కేంద్రంలోని సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42–బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం సమకూర్చారు.ఇందులో భాగంగా సుమారు 185 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు లక్ష్యాన్ని అధిగమించాలి

జీసీసీ డీఎం పార్వతమ్మ


చింతపండు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీసీసీ డీఎం పార్వతమ్మ

పెదబయలు: గిరిజన సహకార సంస్థ(జీసీసీ) బ్రాంచిలకు నిర్దేశించిన చింతపండు కొనుగోలు లక్ష్యాన్ని అధిగమించాలని పాడేరు డివిజనల్ మేనేజర్ కె.పార్వతమ్మ అన్నారు. పెదబయలు వారపు సంతలోని జీసీసీ చింతపండు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ నాణ్యమైన చింతపండును మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.ప్రభుత్వం కిలో చింతపండుకు రూ.32.40 చెల్లిస్తోందని తెలిపారు. డీఆర్ డిపోల పరిధిలో కూడా చింతపండు కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. పెదబయలు బ్రాంచి ద్వారా 850 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటికి 80 క్వింటాళ్లను కొనుగోలు చేసినట్టు తెలిపారు. అనంతరం స్థానిక పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు.బంక్‌లో డీజిల్, పెట్రోల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్థానిక జీసీసీ మేనేజర్ గాసీ, సిబ్బంది దీనాకుమారి, పద్మనాభం ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలియజేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

అరుకులోయ రూరల్: కడప జిల్లా బహులార్ద పశు వైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ అచ్చన్న హత్యకు గురికావడంపై అరకులోయ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ అశ్వత్థామ మాట్లాడుతూ అధికారి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు గణేష్, సీనయ్య, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3న ఇగ్నో వార్షిక వేడుకలు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన 36వ వార్షిక వేడుకలు నిర్వహించనున్నారు. విశాఖ నగరంలోని జైల్ రోడ్డు దరి విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వివిధ కోర్సుల్లో డిగ్రీలు పొందిన వారికి పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి

- రాష్ట్ర పారిశ్రామిక విధానమే కారణం
- కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్ భేటీ


కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్

మహారాణిపేట : భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న వ్యాపార సంస్థలు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటున్నాయని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పారిశ్రామిక వేత్తలను ఆకర్షించే విధంగా రాష్ట్రంలో పారిశ్రామిక విధానం అమల్లో చేస్తున్నామన్నారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఏపీని ఎంచుకుంటున్నారని చెప్పారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో కొరియా అధికారుల ప్రతినిధుల బృందం సోమవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుంది. విశాఖపట్నంలో ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు అంశంపై చర్చించామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. వర్తక వాణిజ్యరంగంలో ఆంధ్రప్రదేశ్ సౌత్ ఏషియాకు ముఖ ద్వారంగా నిలిచిందని మంత్రి అమర్‌నాథ్ కొరియా బృందానికి వివరించారు. ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలు మరింత బలపడాలని మంత్రి అమర్‌నాథ్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.